# ఉన్నతశిఖరం

## ద్విభాష్యం రాజేశ్వరరావు

"సార్!"

చదువుతున్న ఫైలులోంచి తలెత్తి చూసేను!

తలుపు దగ్గర చిదంబరం!

'ఏం కావాలి?' అన్నట్లు అతని వంక చూస్తూ "రండి!" అన్నాను.

మెల్లగా నా టేబిల్ దగ్గరకు వచ్చి "ఆఫ్ డే లీవు కావాలి!" అన్నాడు. సెలవు అడుగుతున్న అతని ముఖంలో ఏలాటి భావాలూ చదవలేకపోయాను!

వినయం లేదు! తిరస్కారం లేదు!!

అభ్యర్థన లేదు!!!

'నా లీవు నేను పెట్టుకుంటున్నాను. కాదనటానికి నువ్వెరివి?' అన్నట్లుంది.

కేవలం అదొక స్టేట్‌మెంట్! అంతే!!

కనీసం నా వంక చూస్తూ అడగలేదు! అలా అడిగివుంటే అతని కళ్ళలో భావాలనయినా పసిగట్టగలిగి వుండే వాడిని!

"ఎందుకు?" అన్నాను విసుగ్గా ముఖంపెట్టి.

"అర్జెంటు పని పడింది." అన్నాడు విషయం స్థూలంగా తేల్చేస్తూ.

'అంత అర్జెంటు పని ఏమిటో చెప్పి తగులడరాదూ?' అనుకున్నాను మనసులో.

"మిస్టర్ చిదంబరం!..." గొంతులో గాంభీర్యం తెచ్చిపెట్టుకుంటూ అన్నాను "... ఈ వేళ డిస్పేచ్ కావల్సిన ఉత్తరాలు చాలా వున్నాయి. పన్నెండు ఆర్డర్లు ఇంకా మిగిలిపోయాయి. వాటన్నిటికీ 'వోచర్స్' తయారు చెయ్యాలి! గేట్ పాస్‌లు కూడా రాయాలి! ఇదంతా మూడు గంటల్లోగా జరగకపోతే గొడవున్‌లో నుండి పెయింట్ డబ్బాలు బయటకు రావు..." మాటలు ఆపి వాచీవంక చూసుకుని "... అప్పుడే పన్నెండున్నర అయిపోయింది ఈ పనంతా ఎలా పూర్తవుతుంది?... సారీ! ఈ పూట మీకు లీవు ఇవ్వటం కుదరదు!..." అంటూ అతని సమాధానానికి ఎదురుచూసే ప్రసక్తేలేదన్నట్లు ఎదుటిఫైలు చూడటంలో మునిగిపోయాను!

మునిగిపోవటం కాదు! మునిగిపోయినట్లు నటించేను! అంతే!!...రెండు నిమిషాలువరకూ చిదంబరం అక్కడ నుండి కదల్లేదు.

తల దించుకున్న నాకు, అతని ముఖం కన్పించకపోయినా, కదలకుండా నిలబడిపోయిన అతని కాళ్ళు మాత్రం కన్పిస్తున్నాయి!

ఆ పరిస్థితి అట్టేసేపు కొనసాగనివ్వటం ఇష్టంలేక "యూ కెన్ గో టు యువర్ సీట్" అన్నాను తలఎత్తకుండానే.

ఆ మాటలు 'యూ కెన్ గో టు హెల్!' అనే రీతిన చెప్పేను.

చిదంబరం మౌనంగా కదిలిపోయాడు.

అదే!!

అదే, నాకు అరికాలి మంట నెత్తికెక్కించే ప్రవర్తన!!

ఈ ప్రవర్తనే, అతనిమీద నాకు సదభిప్రాయం కలుగనివ్వకుండా మొదటి నుండీ అడ్డుపడుతోంది!

నిజంగా, అర్జెంటుగా సెలవు కావల్సిన వాడయితే, పరిస్థితి వివరించి చెప్పొచ్చు కదా! అలా చెప్పడు!!

మరో మాటకు పెదాలు విప్పితే ముత్యాలు రాలిపోతాయన్నట్లు ప్రవర్తిస్తాడు!

ప్రతిమాలడు! కనీసం, అభ్యర్థన ముఖంలోకానీ, గొంతులోకానీ చూపించవచ్చు కదా! అదీ చెయ్యడు!

అభ్యర్థిస్తే అతని పరువు నష్టమయిపోతుంది కాబోలు!

నా కింద పనిచేసే ఓ గుమాస్తాకే అంత పొగరయితే, ఆఫీసరునయిన నాకెంత పొగరుండాలి??

'క్లిక్'మన్న శబ్దంతో మెల్లగా తలెత్తి చూసేను.

'హైడ్రాలిక్ డోర్ క్లోజర్'తో తలుపు మూసుకుంది!

చిదంబరం వెళ్ళిపోయాడు!!


టేబిలు మీది ఫైలు ప్రక్కకుతోసి. బద్దకంగా కుర్చీలో వెనక్కు వాలేను!

పెయింట్స్ తయారుచేసే మా ప్లాంటు విశాఖపట్టణానికి కొద్ది దూరంలో ఓ పల్లెటూరులో వుంది. తయారయిన రంగు డబ్బాలన్నీ విశాఖపట్నంలోని గొడవున్‌కు చేరుస్తారు. గొడవున్‌ను అనుకుని ఆఫీసు వుంది. ఇక్కడ ఈ ఆఫీసు వ్యవహారాలన్నీ అప్పుడే అయిదు సంవత్సరాలుగా నేనే చూస్తున్నాను. మాకు హైదరాబాద్‌లో, విజయవాడలోనూ బ్రాంచి ఆఫీసులున్నాయి. ఈ మూడు ఊళ్ళ మధ్యా స్టాఫ్ బదిలీలు జరగటం మామూలే! అదిగో! అలాంటి బదిలీ సందర్భంలోనే ఆరు నెలల క్రితం చిదంబరం విజయవాడ నుండి బదిలీ మీద మా ఆఫీసుకు వచ్చేడు!

అతడు వచ్చి ఆరు నెలలయినా అతని వ్యవహారం నాకు ఈనాటికీ విచిత్రంగానే అన్పిస్తుంది! ఆఫీసులో

ఎవ్వరితోనూ ఎక్కువగా మాట్లాడడు! ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పేసి ఊరుకుంటాడు! అతను నవ్వటం నేనెప్పుడూ చూడలేదు! కనీసం 'జోక్' చేసినపుడు 'రియాక్ట్' అవటం కూడా గమనించలేదు!!

మధ్యాహ్నం 'లంచ్' సమయంలో అందరం కలిసి డైనింగ్ హాలులో కూర్చుని ఎవరి 'కేరియర్లు' వాళ్ళు తింటాం! ఆఫీసరు, గుమాస్తాలు అనే తేడా లేకుండా స్టాఫ్ అందరం కలిసి ఛలోక్తులు విసురుకుంటూ భోజనాలు చేస్తాం! ఆ సమయంలో కూడా చిదంబరం అక్కడికి రాడు! తన టేబిలు దగ్గరే కుర్చీకి అంటిపెట్టుకుని వుండిపోతాడు. తనతోబాటు తెచ్చుకున్న టిఫిన్ బాక్సులోని ఒక్క చపాతీ తినేసి మూతి తుడిచేసుకుంటాడు.



అతడు చేరిన కొత్తలో తోటి గుమాస్తాలు, ఆఫీసు అసిస్టెంట్లు అతడిని మార్చటానికి ఎన్నో ప్రయత్నాలు చేసి విసుగెత్తి ఊరుకున్నారు.

చిదంబరం నాకు మాత్రం అర్థం కాని పజిల్‌గానే మిగిలిపోయాడు!

అతని వ్యవహారం నాకో పెద్ద సమస్య!

అయితే, అతటి తోటి గుమాస్తాల నుండి అతని మీద 'కంప్లైంట్' ఏదైనా వస్తుందేమోనని చాలా కాలం ఎదురు చూసేను! కానీ, అలాటిదేమీ రాలేదు!

'చిదంబరం అలా వుంటాడేమిటి?' అంటూ ఒకటి రెండుసార్లు నేను ఎత్తి పొడిచినా, ఎవ్వరూ అంతగా 'రియాక్ట్' కాలేదు!

'అతని తీరే అంత!' అని ఒకరూ-

'కొందర్ని అచ్చువేసి వదిలెయ్యాలి సార్!' అని వేరొకరూ-

'అంత పొగరు ఆయనకి వుంటే మన పొగరు మనకీ వుంటుంది సార్!' అని మరొకరూ—

'మ్యూజియంలో పెట్టాల్సిన కేసు' అని ఇంకొకరూ—ఇలా వేరు వేరు వ్యాఖ్యానాలు చేస్తూ తేలిగ్గా నవ్వేశారే తప్ప అతనిమీద ఏ విధమయిన 'రిపోర్టు' నాకు ఏనాడూ ఇవ్వలేదు!!

పని విషయంలో వేలెత్తి చూపించటానికి ఆస్కారం ఇచ్చినట్టు కూడా హెడ్ గుమాస్తా నాతో ఎన్నడూ చెప్పలేదు! ఆఫీసుకు రావటంలో ఏనాడూ లేటయినట్లు వినలేదు! సాయంకాలం అయిదయ్యాక మాత్రం ఒక్క నిమిషం కూడా సీట్లో వుండడు!

'ఆఫీసరుగారు వెళ్ళేదాకా మనం వెళ్ళిపోకూడదు' అని ఒకసారి హెడ్ క్లర్క్ హెచ్చరిస్తే, 'నాకిచ్చిన ఆర్డరులో అలాటిదేమీ రాసిలేదు! అందుకని అయిదు గంటలు కాగానే వెళ్ళిపోతున్నాను!' అంటూ వెళ్ళిపోయాడట.

ఆ తర్వాత హెడ్ క్లర్క్ అతడికి చెప్పటం మానేశాడు.

ఆ విషయమై నేను కూడా అతడిని పిలిచి అడగలేదు!

'సమయం వస్తే దొరక్కపోతాడా?' అనే ఒక రకమయిన కసి నాలో వుండి పోయింది నిజానికి!

'అయితే, చిదంబరం మీద నాకు కసి ఎందుకు?' అని ఆలోచిస్తే మాత్రం సరియైన సమాధానం దొరకదు! అది అంతే!!

చిదంబరం మనస్తత్వం గురించి ఆలోచిస్తూ బుర్ర పాడుచేసుకోవటం ఇష్టంలేక, ఆవేళ చేయాల్సిన పనుల గురించి, హైద్రాబాద్ పంపాల్సిన స్టేట్‌మెంట్స్ గురించీ, గొడవునులో స్టాక్ ఇన్‌వెంట్రీ గురించీ ఆలోచిస్తూ మళ్ళీ ఆఫీసు పనిలో నిమగ్నమయిపోయాను!

అయితే 'చిదంబరానికి అవసరం వచ్చినపుడు ఆఫ్ డే లీవు 'రిజక్టు' చేయగలిగాను కదా! అనే ఒక రకమయిన తృప్తి మాత్రం మనసులో ఏమూలనో చోటుచేసుకుంది. కాని, అది ఎంత సేపో నిలబడలేదు!

అరగంట తర్వాత—

లంచ్ అవర్లో నా పర్సొనల్ సెక్రెటరీ సుగుణ, నా గదిలోకి వచ్చి ఒక ఉత్తరం అందించింది.

"సార్! చిదంబరం ఆఫ్ డే లీవు పెట్టి వెళ్ళిపోయాడు కదా! ఇదిగో లీవ్ లెటరు!" అంటూ

నాకు పిచ్చెత్తినంత పనయింది!!

"ఎవరితో చెప్పి వెళ్ళిపోయాడు? డామిట్! ఆఫీసులో డిసిప్లిన్ అసలు లేకుండా పోయింది! ఇది ఆఫీసనుకున్నాడా?... అడివనుకున్నాడా? దాదాపు అరచినట్లు అడిగేను.

నాలో ఏనాడూ అంత కోపం చూడలేదు కాబోలు, సుగుణ మొహం తేలేసింది!

కొంతసేపు మాట్లాడకుండా భయంగా నా వంక చూస్తూ వుండిపోయింది!

"ఇందాకా మీరూంలోకి వస్తే, మీకు చెప్పేడనుకున్నాను!" అంది మరింత భయంతో.

అప్పుడర్ధమయింది నేనెంత గట్టిగా అరిచానో! ఎంత కోపం నా ముఖంలో చూపించేనో?!

రెండు నిమిషాలు మాట్లాడకుండా వుండిపోయాను!

తర్వాత అన్నాను "నాతో చెప్పేడు కానీ లీవు తీసుకోవద్దన్నాను ...మరి ఎలా వెళ్ళిపోయాడు?"

"ఏమోసార్! ఏదో అర్జెంటు పని వుందని వెళ్ళిపోయాడు!" అంది.

"పనేమిటో మీకూ చెప్పలేదా?"

"చెప్పలేదు సార్! మీతో మాట్లాడినపుడు చెప్పివుంటాడని నేను వివరాలు అడగలేదు! అడిగినా అతడు చెప్పడు!" అంది సుగుణ, అతని మూలంగా తాను నింద భరించవలసి వచ్చినందుకు ఇబ్బందిగా ముఖంపెట్టి!

"ఐసీ!...సరే!... ఈవేళ ఆఫ్ డే ఆబ్సెంటు మార్కు చేయండి. 'లాస్ ఆఫ్ పే' చేద్దాం! అప్పుడుగాని బుద్ధి రాదు!" అన్నాడు.

"అలాగే సార్!" అంది సుగుణ.

లీవులెటర్ మీద 'రిజెక్టెడ్' అని రాసి సంతకం చేశాను!

కాగితం తీసుకుని సుగుణ వెళ్ళిపోయింది.

నాకు నెత్తిమీద నిప్పులు పోసినట్లుంది, చిదంబరం వ్యవహారంచూస్తే!

'అసలు అతడి ఉద్దేశ్యం ఏమిటి? లీవు ఇవ్వనంటూ వుంటే ఎలా వెళ్ళిపోయాడు?ఎంత పొగరు!! లాభంలేదు! ఓపాఠం చెప్పాలంటే జీతం కోసెయ్యటమే మార్గం!' అనుకున్నాను.

ఆవేళ్టి గేట్‌పాస్‌ల పని సుగుణకు అప్పజెప్పేను! మిగిలిన పని ఇతర గుమాస్తాల చేత చేయించేను! ఆ సాయంకాలం హైద్రాబాద్ ఆఫీసునుండి ఫోన్ రావటంతో ఆ రాత్రికి రాత్రే బయలుదేరి వెళ్ళాల్సి వచ్చింది!

తిరిగి విశాఖ వచ్చేసరికి మరో నాలుగు రోజులు గడిచిపోయాయి! చిదంబరాన్ని పిలిచి మాట్లాడటానికి నాకు వ్యవధి చిక్కలేదు!

* * *

ఓ వారంరోజులు గడిచిపోయాయి!

అంతలో నా పుట్టినరోజు వచ్చింది!

నా జన్మదిన సందర్భంగా ఆఫీసు వాళ్ళందర్నీ మా ఇంటికి పిలిచి పార్టీ ఇవ్వటం ప్రతి ఏడాదీ నాకు అలవాటు! గత అయిదేళ్ళుగా ఈ అలవాటు కొనసాగిస్తున్నాను.

నా పుట్టినరోజు పార్టీ పేరుతో నేను పడే శ్రమ నిజానికి ఏమీలేదు!!.

ఓ ఆఫీసు అసిస్టెంటు షామియానా, కుర్చీలు, బల్లలు ఏర్పాటు చేస్తాడు! మరొకాయన టిఫిన్ సప్లయి వ్యవహారం చూసుకుంటాడు. గుమాస్తాలు మా డాబా అలంకరణ చేస్తారు!

ఆఖరుకు పార్టీకి రమ్మని అందర్నీ ఆహ్వానించటం కూడా నేను చెయ్యను. సుగుణ నా తరపున ఆహ్వానం చేస్తుంది!!

ఇలా అందరూ తలోపనీ సర్దుకుని చేస్తే నాకు శ్రమ ఏముంటుంది?

మరునాడు వచ్చిన బిల్లులు మాత్రం నా టేబిలుమీదకు చేరుతాయి!

ఆ బిల్లులు 'పే' చేసే అవకాశం కూడా నాకు వుండదు! ఎందుకంటే మా హెడ్ క్లర్కు వచ్చి 'ఆ బిల్లులు ఇలా ఇచ్చేయ్యండి సార్! మన మెటీరియల్ సప్లయి కాంట్రాక్టర్ సురేష్ వీటి సంగతి చూసుకుంటాడులెండి' అంటూ వాటిని తీసుకుపోతాడు.

ఓ ఏడాది సురేష్ అయితే తర్వాతి ఏడాది మరో నరేష్!

ఇలా ఎవరో ఒకరు ఆ వ్యవహారం కూడా సర్దుకుంటున్నారు!!.

అందువల్ల దమ్మిడీ ఎత్తు శ్రమ, పైసా ఖర్చు లేకుండా నా జన్మదిన మహోత్సవాలు నిరాటంకంగా అయిదేళ్ళుగా జరుపుకుంటున్నాను!

అదే విధంగా ఈ ఏడాదికూడా మా ఇంటి డాబామీద నా పుట్టినరోజు పార్టీ ఏర్పాటయింది!!

ప్రతి సంవత్సరం కంటే ఎక్కువగా ఖర్చుచేసి డాబా అలంకరించేరు!

ఏడెనిమిది రకాల పదార్థాలు తయారు చేయించేరు!

ఫొటోగ్రాఫర్ని పిలిచి కలర్ ఫొటోలు తీసే ఏర్పాటు కూడా చేశారు!

ఏడు గంటలయ్యేసరికి స్టాఫ్ అంతా ఒక్కొక్కరే చేరుకున్నారు! నా జన్మదిన శుభాకాంక్షలు అందజేశారు!

పార్టీ ఆరంభమయిపోయింది!

ఎంతసేపు ఎదురుచూసినా రానిది ఒక్కరే!

చిదంబరం!!

జీతం కోతపెట్టినందుకు 'అలిగాసు కాబోలు' అనుకున్నాను!

చిదంబరం ఈ పార్టీకి రాకుండా నా 'అహం' మీద దెబ్బకొట్టినట్లు అనిపించింది. అతనిపై 'కసి' మరింత అధికమయింది. మా స్టేఫ్ మాత్రం అతడు రాకపోవటాన్ని గురించి పెద్దగా పట్టించుకున్నట్లు నాకు అనిపించలేదు! పైగా అతడు వస్తే 'అదేదో ఆశ్చర్య పోవలసిన విషయం'లా మాట్లాడుకున్నారు! నవ్వుల మధ్యలో, పాప్ సంగీతం సందడిలో, చల్లని వాతావరణంలో విందు పూర్తయిపోయింది!

తర్వాత, రెండు ట్రిప్పుల్లో నేనే స్వయంగా అందర్నీ వాళ్ళ వాళ్ళ ఇళ్ళ వద్ద కారులో దింపేను మర్యాద పూర్వకంగా!

రెండో ట్రిప్ ముగించి తిరిగి వస్తూండగా దారిలో చిదంబరం కనిపించేడు!

కారు హారన్ విని తుళ్ళిపడ్డట్లు వెనక్కి చూస్తే, అప్పుడు అతన్ని గుర్తించి కారు అతడి ప్రక్కకు తీసుకువెళ్ళి ఆపేను!!

కారు దగ్గరగా వచ్చి "నమస్కారం!...మీ ఇంటికే బయలుదేరేను! మీరు పదండి! నేను నడచి వచ్చేస్తాను పావుగంటలో!" అన్నాడు

డోర్ తెరచి "ఎక్కండి! ఫర్వాలేదు!" అన్నాను.

చిదంబరం ఎక్కి కూర్చున్నాడు!

కారు బయలుదేరింది!

కొన్ని నిముషాలు మౌనం మా ఇద్దరి మధ్యా చోటుచేసుకుంది!

ఆవేళ ఆఫీసులో జరిగిన విషయానికి క్షమాపణ చెప్పుకుంటాడేమోనని కొంత సేపు నిరీక్షించాను! కానీ అలాంటి ప్రయత్నం ఏదీ అతడు చేసేలా నాకు అన్పించలేదు!

ఇక, ఉండబట్టలేక నేనే ఆ విషయం గుర్తుచేశాను.

"చిదంబరం! ఆ వేళ నేను వద్దని




చెప్తున్నా వినకుండా మీరు లీవు పెట్టి వెళ్ళిపోవటం నాకు నచ్చలేదు!" మనసులో ఓ రకమయిన కసి వుండటం వల్ల కాబోలు మాటలు కాస్త కటువుగానే బయటకు వచ్చేయి!

ఈ ప్రస్తావనకు చిదంబరం సిద్ధంగా వున్నట్టు లేదు!

కొంత సేపు ఇబ్బందికరమయిన నిశ్శబ్దం మా మధ్య చోటుచేసుకుంది!!

ఈ విషయం చర్చించటం అప్రస్తుత మనిపించినా, అంతలోనే ఆ ఆలోచనను మనసు మూలపొరల్లోకి నెట్టేశాను!

చిదంబరం ఎంతకీ సమాధానం చెప్పకపోయేసరికి "ఏం మాట్లాడరేం" అన్నాను.

ఇక లాభం లేదనుకున్నట్టున్నాడు "మా పక్కింటి ముసలాయనకి సీరియస్‌గా వుందని ఆవేళ కబురొచ్చింది! అందుకని వెళ్ళిపోయేను! ......" అన్నాడు నిట్టూర్పు వదుల్తూ.

"మీ పక్కింటి ముసలాయనకి... సీరియస్‌గా వుందని కబురొస్తే... వెళ్ళిపోయారా?....ఆయన మీ కేమవుతాడు?" ప్రతి మాటా విరుస్తూ వ్యంగ్యంగా ప్రశ్నించేను

నా మాటల్లోని వ్యంగ్యాన్ని గుర్తించినట్లు లేదు చిదంబరం!

"చుట్టరికం ఏమీలేదు సార్!" అన్నాడు.

"మరి..." అంటూ అర్ధోక్తిగా ఆగి అతని వంక చూసేను.

"పక్కింటి మనిషి!... అంతే! ... పక్కింటి మనిషికి సీరియస్‌గా వుందని కబురొస్తే వెళ్ళి సాయంచేయవద్దా?" అన్నాడు అతి సహజంగా. దాంతో నాకు అరికాలి మంట నెత్తికెక్కింది!!

"చిదంబరం! పక్కింటి ముసలాయనకీ, ఎదురింటి ముసిల్దానికీ, వెనకింటి పడుచుపిల్లకీ చాకిరీ చేస్తూ కూర్చుంటే మరి, ఆఫీసు పని ఎవరు చేస్తారను కున్నారు?" కాస్త కోపం ధ్వనించేలా గొంతు మార్చి మరీ అడిగేను.

దెబ్బతిన్నట్లున్నాడు, ఒక్క నిమిషంపాటు మౌనంగా వుండిపోయాడు చిదంబరం!!

"ఆఫీసు పని నే నొక్కడినీ చేయనంతలో ఆగిపోదు సార్! ... ఎవరో ఒకరు చేస్తారు! ఆ రోజున నేను లేనంత మాత్రాన 'డిస్పేచ్' ఆగిపోయిందా?..." అంటూ కొంత సేపు ఆగి మళ్ళీ అన్నాడు "...రోజూ అలా వెళ్ళిపోవటం లేదుకదా! ... ఆవేళ అలా

వెళ్ళాల్సి వచ్చింది!...మా పక్కింట్లో వుంటున్న ముసలాయనకి దిక్కెవరూ లేరు...ఒక్క కొడుకు తప్ప!... అతడేమో అవిటివాడు!...నడిచి ఎక్కడికీ వెళ్ళలేడు! అతడి కాలకృత్యాలకే మరొకరి సాయం కావాలి!...ఇద్దరూ దిక్కులేని పక్షులే!! అందువలన కబురొస్తే వెళ్ళేను!...రిక్షాలో పడేసుకుని హాస్పిటల్‌లో చేర్పించేను...మన చుట్టం కానంత మాత్రాన ఆపదలో వున్న మనిషిని గాలికి వదిలెయ్యటం న్యాయం కాదుగదా!...''

ఆఖరు వాక్యంతో మరింత ఒళ్ళు మండిపోయింది నాకు!

పుండుమీద కారం చల్లినట్లయింది! నాకే నీతులు చెప్తున్నాడా???

అసలు ఇదంతా ఓ కట్టుకథ ఎందుకు కాకూడదు?

నాకు అతడు చెప్పే విషయం నమ్మబుద్ధి కాలేదు సరికదా, పరోపకారం మాటలు మనసుకు పట్టలేదు!

ఆవేళ సంగతి సరే, మరి, ఈవేళ నా పుట్టిన రోజు పార్టీకి ఎందుకు రాలేదు? సరిగ్గా ఆరు గంటలకు ఆరంభమవుతుందని అతనికి తెలుసు! మరి, ఇప్పుడా రావటం!!

దారిలో దొరికిపోయాడు కనుక, మార్గాంతరంలేక, మా ఇంటికే వస్తున్నట్లు చెప్పేడా?!

బహుశః అదే నిజమయి వుంటుంది!!

అంతలో కారు మా ఇంటికి సమీపించింది! గేటు తెరవటానికి కారు దిగేను! చిదంబరం కూడా తలుపు తెరిచి అవతలి ప్రక్కకు దిగేడు.

"మీ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి వెళ్దామని వచ్చేను..." అంటూ ఎదరకు వచ్చి "విష్ యూ మెనీ హేపీ రిటర్న్స్!" అన్నాడు.

"థేంక్యూ!...సాయంకాలం నలుగురితో బాటూ వచ్చి ఈ ముక్కలు చెప్పివుంటే చాలా ఆనందించేవాణ్ణి!... అయినా మీకు ప్రజాసేవకే సమయం చాలటం లేదు! .. లీవులు పెట్టాల్సి వస్తోంది...అలాటిది, పార్టీలకు ఎలా వస్తారు?" అంటూ వ్యంగ్యంగా మరో విసురు విసిరేను.

ఈసారి చిదంబరం 'రియాక్ట్' అయ్యేడు!

అతని గొంతు స్థాయి పెరిగింది!!

"సార్! మీ పుట్టినరోజు మహోత్సవం సందర్భంగా తోరణాలు కట్టటానిక్కి, వేడుకలలో పాల్గొనటానికీ నేనొక్కణ్ణీ రాకపోయినా ఫర్వాలేదు!... అందువల్ల మునిగిపోయింది ఏమీ లేదు...వేడుకలకి వచ్చి శుభాకాంక్షలు తెలిపేందుకు బోలెడంత మంది వున్నారు...కానీ...కానీ మా పక్కింటి ముసలాయన చచ్చిపోతే శవవాహనానికి ఒక్కరంటే ఒక్కరు కూడా ముందుకు రాలేదు సార్!... మధ్యాహ్నం పన్నెండు గంటలకు పోయిన మనిషిని సాయంకాలం నేను ఆఫీసు నుంచి వెళ్ళేదాకా కనీసం కిందకు దింపి పడుకోబెట్టటానిక్కి కూడా ఎవ్వరూ లేరు! ... ప్రేమ సమాజంలోని మనుషుల సహాయం తీసుకుని, శ్మశానానికి తీసుకువెళ్ళి నేనే స్వయంగా కొరివికి నిప్పంటించేను ... దరిద్రుడి పెళ్ళికి వడగళ్ళ వానట!...దిక్కులేని వాడి చితికి అన్నీ తడికర్రలే సమకూడేయి!...కాష్టం కాలేసరికి ఆలస్యమయిపోయింది! ... తంతు ముగించి, ఇంటికి వెళ్ళి స్నానంచేసి వచ్చేసరికి మరింత లేటయింది!...మరోలా అనుకోకండి!!!" మాటలు ముగించి నా సమాధానానికి ఎదురుచూడకుండా చకచకా వెళ్ళిపోయాడు! నా వీపుమీద కొరడాతో ఎవరో ఛళ్ళున చరిచినట్లయింది!

చిదంబరంలోని మనిషిని నేనెంత తక్కువగా అంచనా కట్టేను?!!

అతడి ముందు నేనెంత అల్పుణ్ణి?! నాకు కొంత సేపు మతిపోయినట్లయింది!

దూరంగా చీకటిలో నడిచిపోతున్న చిదంబరం నాకు కదిలిపోతున్న మహోన్నత శిఖరంలా కనుపించేడు!!!

